

మేయరుగా పాకా సురేశ్

- ఖరారు చేసిన వైసీపీ
- ఎంపీ అవినాశ్ ఇంట్లో కార్పొరేటర్ల సమావేశం
- పీఠం కోసం ముగ్గురు పోటీ
- పాకా వైపు మొగ్గు చూపిన మెజారిటీ కార్పొరేటర్లు
- నేడు కార్పొరేషన్ మేయరు ఎన్నిక
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



సమావేశ మందిరాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



పాకా సురేశ్

(కడప-ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ మేయరు అభ్యర్థిగా 47వ డివిజన్ కార్పొరేటరు పాకా సురేశ్‌ను వైసీపీ ఖరారు చేసింది. మాజీ మేయరు సురేశ్‌బాబు నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయడంతో మున్సిపల్ శాఖ ఆయనను పదవి నుంచి తొలగించింది. దీంతో మేయరు ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికలను అడ్డుకునేందుకు మాజీ మేయరు సురేశ్‌బాబు న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ ఎన్నికలకు కోర్టు లైన్ క్లియర్ చేసింది. గురువారం ఉదయం కార్పొరేషన్ సమావేశ మందిరంలో జేసీ అదితిసింగ్ అధ్యక్షతన మేయరు ఎన్నిక అధికారికంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలుకానుంది.

మేయరు పదవి కోసం పోటీ

మేయరు పదవి కోసం వైసీపీ కార్పొరేటర్ల మధ్య పోటీ నెలకొంది. కడప వైసీపీలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ మేయరు సురేశ్‌బాబు వర్గాలుగా ఉన్నారు. కార్పొరేటర్లలో కూడా మూడు వర్గాలున్నాయి. మేయరు పదవి కోసం 47వ డివిజను కార్పొరేటరు పాకా సురేశ్, 10వ డివిజను కార్పొరేటరు మల్లికార్జున, 37వ డివిజను కార్పొరేటరు శ్రీవాణి పోటీపడ్డారు. ఇది వైసీపీలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయాన్ని జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, ఎంపీ అవినాశ్‌రెడ్డి మాజీ సీఎం జగన్ దృష్టికి తీసుకు వెళ్లారని అంటున్నారు. సమయం తక్కువ ఉండడంతో కార్పొరేటర్ల అభిప్రాయాలు తీసుకుని ఎంపిక చేయాలని జగన్ చెప్పారంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం అలంఖాన్‌పల్లె సమీపంలో ఉన్న ఎంపీ అవినాశ్‌రెడ్డి స్వగృహంలో ఎంపీతో పాటు రవీంద్రనాథ రెడ్డి, అంజద్‌బాషా, సురేశ్‌బాబు, మాసీమ బాబు కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. మేయర్ స్థానం కోసం ముగ్గురు పోటీ పడుతుండడంతో కార్పొరేటర్లతో ఓటింగ్ నిర్వహించారు. మేయర్‌గా ఎవరు ఉండాలో చీటీలు రాయాలని సూచించారు. సమావేశానికి 39 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు. ఓటింగ్‌లో పాకా సురేశ్ వైపు ఎక్కువ మంది మొగ్గుచూపడంతో ఆయన పేరును ఖరారు చేసినట్లు వెల్లడించారు.

అధికారికంగా మేయరు ఎన్నిక గురువారం జరగనుంది. అక్కడ మేయరు పదవి ఆశించే అభ్యర్థులు పోటీలో ఉన్నామని చెప్పి నామినేషన్ వేస్తే తరువాత కార్పొరేటర్లతో ఓటింగ్ నిర్వహిస్తారు. అయితే ముందుగానే కార్పొరేటర్లతో ఓటింగ్ నిర్వహించి అభ్యర్థిని వైసీపీని ఖరారు చేసింది. కాగా పాకా సురేశ్ వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డికి ముఖ్య అనుచరుడుగా పేరొందారు. గురువారం జరిగే మేయర్ ఎన్నిక కార్యక్రమానికి టీడీపీలో ఉన్న కార్పొరేటర్లు, ఎక్స్‌అఫీషియో మెంబర్లు సైతం హాజరయ్యే అవకాశం ఉంది.

సురేశ్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కడప మాజీ మేయరు సురేశ్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. కడప మేయరు ఎన్నిక నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. మేయర్ ఎన్నికను నిలుపుదల చేసేందుకు నిరాకరించింది. సభ్యుల పదవీ కాలం ముగియడానికి ఆరునెలల ముందు ఎన్నికలు నిర్వహించడానికి వీల్లేదన్న సురేశ్‌బాబు వాదనను తోసిపుచ్చింది. మేయర్, డిప్యూటీ మేయర్ పోస్టుల ఎన్నికకు ఈ నిబంధన వర్తించదని తేల్చిచెప్పింది. మేయర్ ఎన్నిక నిర్వహణకు ఎన్నికల కమిషన్ ఇచ్చిన నోటిఫికేషన్ చట్టబద్ధమైనదేనని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ బుధవారం తీర్పు ఇచ్చారు.

ప్రారంభమైన టెట్-2025

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్ 2025) ప్రారంభమైంది. తొలిరోజు బుధవారం 94శాతంమంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 8 కేంద్రాల్లో టెట్ ప్రారంభమైంది. ఈ పరీక్షలకు జిల్లాలో 1149 మంది హాజరుకావాల్సి ఉండగా 1087 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 709మంది హాజరుకావాల్సి ఉండగా 673 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 440 మందికి గాను 41 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ షంషుద్దీన్ తెలిపారు.

పరిశీలన



ఇత్తడితో తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్

ఇత్తడి వస్తువులకు వనిపెంట ప్రసిద్ధి

మైదుకూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వనిపెంట అంటేనే ఇత్తడి వస్తువులకు ప్రసిద్ధి అని, ఇక్కడ చేసిన ఇత్తడి వస్తువులకు దేశవ్యాప్తంగా మంచి పేరుందని ఏపీ హ్యాండ్ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని వనిపెంట ఇత్తడి పరిశ్రమ వద్దకు బుధవారం ఆయన విచ్చేసి 'గురు శిష్య హస్తకళా శిక్షణ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. లోహం కరిగించుట, అచ్చు తయారీ, కాస్టింగ్, మోతకట్టు చెక్కడం తదితర విషయాలను నేర్పించడంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ శిక్షణ నిమిత్తం 30 మంది కళాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇక్కడ తయారైన వస్తువులకు ఏపీ హ్యాండ్ క్రాఫ్ట్స్ కార్పొరేషన్, లేపాక్షి ఎంపోరియం మార్కెటింగ్‌లో మద్దతుగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, ఖాజీపేట సిండికేట్ బ్యాంకు చైర్మన్ హరినాథరెడ్డి, లేపాక్షి సంస్థ ప్రతినిధులు లక్ష్మీనాథ్, శ్రీకాంత్, దిల్లీరావు, వనిపెంట ఇత్తడి పరిశ్రమ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఇస్మాయిల్, ధనపాల రవి తదితరులు పాల్గొన్నారు.

చట్టపరంగా న్యాయం చేస్తాం

- కేకే కొట్టాల ప్రజలకు కలెక్టర్ హామీ



కేకే కొట్టాల ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

(కడప-ఆంధ్రజ్యోతి): యురేనియం ప్రాజెక్టు కారణంగా ఇబ్బందులు పడుతున్న కేకే కొట్టాల ప్రజలకు చట్టపరంగా న్యాయం చేస్తామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హామీ ఇచ్చారు. ఎం.తుమ్మలపల్లెలో ఏర్పాటు చేసిన యూసీఐఎల్ నుంచి ఉత్పత్తి అయ్యే యురేనియం వ్యర్థాలను నిల్వచేసే టెయిలింగ్‌పాండ్ కారణంగా కేకే కొట్టాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో 2018లో ఒకసారి 2021లో మరోసారి టెయిలింగ్‌పాండ్‌ను ఎత్తుపెంచే ప్రయత్నం వీరు ఆందోళన చేశారు. జగన్ సీఎంగా ఉన్నా కేకేకొట్టాల గ్రామస్థులకు ఇప్పటి వరకు న్యాయం జరగలేదు. ఎన్నికల సమయంలో, అంతకు ముందు బీటెక్ రవి కేకే కొట్టాల ప్రజలకు న్యాయం చేస్తామంటూ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ సమస్య పరిష్కారానికి బుధవారం కలెక్టరు చెరుకూరి శ్రీధర్‌ను కేకే కొట్టాల ప్రజలు, బీటెక్ రవి కలిశారు.

కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో యూసీఐఎల్ సమస్యలపై సమీక్షించారు. జనం అక్కడ పడుతున్న ఇబ్బందులన్నింటినీ క్షుణ్ణంగా కలెక్టర్‌కు వివరించారు. కొత్త టెయిలింగ్ పాండ్ నిర్మాణం చేపట్టకముందే కేకే కొట్టాల గ్రామస్థుల భూసేకరణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టరు తెలిపారు. కేకే కొట్టాల రైతులతో యురేనియం ప్రాజెక్టు ఉన్నతాధికారులు మాట్లాడే ఏర్పాటు చేస్తామన్నారు. భూసేకరణ చేపట్టేందుకు పబ్లిక్ నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఇందుకు ఆరు నెలల సమయం పడుతుందని అన్నారు. ప్రస్తుతం నిర్వహణలో ఉన్న పాత టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచుకునేందుకు లేదా రిపేర్లు చేపట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం ఊర్లు వదులుతున్న గ్రామస్థులకు చట్టపరంగా న్యాయపరంగా సహకరిస్తామన్నారు. కేకే కొట్టాల గ్రామస్థులకు ఎలాంటి నష్టం లేకుండా పరిహారం, ఉపాధి అవకాశాల్లో న్యాయబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో చెన్నయ్య, యూసీఐఎల్ జనరల్ మేనేజరు సుమన్ సర్కారు, యుసీఐఎల్ సూపరింటెండెంట్ ల్యాండ్ ఎక్విజేషన్ ఆఫీసరు నవీన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పులివెందులలోనే నివాసగృహాలు : బీటెక్ రవి

టెయిలింగ్‌పాండ్ కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న కేకే కొట్టాల ప్రజల ప్రజలకు పులివెందులలోనే నివాస గృహాలు ఏర్పాటు చేస్తామని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. కలెక్టర్‌ను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టెయిలింగ్‌పాండ్ కారణంగా రకరకాల అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో రేడియేషన్ ఎక్కువగా ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం కలెక్టర్‌ను కలిశామన్నారు. కేకే కొట్టాల వాసులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా పులివెందుల దగ్గరలో 250 చదరపు అడుగుల్లో ఇళ్లు కట్టుకునేందుకు ఏర్పాటు చేస్తామని కలెక్టరు హామీ ఇచ్చారన్నారు అలాగే భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

విచారణ



ఫుడ్ పాయిజన్ జరిగిన వసంతపేట మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుడిని విచారిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని

ఫుడ్‌పాయిజన్‌పై విచారణ

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూలులో ఫుడ్‌పాయిజన్ జరిగి విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయమై జిల్లా ప్రధాన జడ్జి యామిని విచారణ జరిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం ఆమె పాఠశాలలో విచారణ చేపట్టారు. నవంబరు 28వ తేదీ మధ్యాహ్న భోజనం ఫుడ్‌పాయిజన్ అయిన సంఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురప్ప, ఆరోజు వంట రుచి చూసిన ముగ్గురు ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందిన విద్యార్థులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, తహశీల్దారు గంగయ్య, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ ఆనంద్‌బాబులను ఒక్కొక్కరిని ప్రత్యేకంగా విచారించారు. చౌడేశ్వరీదేవి వంట ఏజెన్సీ నిర్వాహకురాలు మోతుకూరు జయలక్ష్మిపై జిల్లా ప్రధాన జడ్జి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. విచారణలో వంట ఏజెన్సీ నిర్వాహకురాలు నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో ఆమెపై కేసు నమోదు చేయాలని సీఐని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో షంసుద్దీన్, ఎంఈవోలు సావిత్రమ్మ, శోభారాణి పాల్గొన్నారు. కాగా.. జిల్లా ప్రధాన జడ్జి విచారణ కన్నా ముందు జిల్లా లీగల్‌సెల్ అథారిటీ కార్యదర్శి ఎస్.బాబాఫకృద్దీన్ విద్యార్థులను విచారించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

శిక్షణ

కడప క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎంపికైన స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల (ఎస్‌సీటీపీ)కు త్వరలో శిక్షణ ప్రారంభం



పరిశీలిస్తున్న ఎస్పీ

కానిస్టేబుళ్ల శిక్షణకు సన్నాహాలు

కానుంది. ఈ నేపథ్యంలో నగరన శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని (డీటీసీ) బుధవారం ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సందర్శించారు. శిక్షణ కేంద్రంలోని వసతి ఏర్పాట్లను, కిచెన్ రూం, తరగతి గదులను, కార్యాలయ గదులను, మైదానం, అంతర్గత రహదారులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎస్పీ వెంట డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, డీటీసీ ఇన్‌స్పెక్టర్ ఎస్.వినయ్‌కుమారరెడ్డి, ఆర్ఎస్ఐ అప్పలనాయుడు, సిబ్బంది ఉన్నారు.

శేషాచలంలో గజ..గజ

- 34 ఏనుగులు, 10 చిరుత పులుల సంచారం
- ఎవరినీ అనుమతించని అధికారులు



శేషాచలం అడవిలో తిరుగుతున్న ఏనుగు

రైల్వేకోడూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల్లో ఏనుగుల మంద సంచరిస్తోందని, 10చిరుత పులులు ఉన్నాయని, అడవిలోకి వెళ్లేందుకు ఎవరికీ అనుమతి లేదని అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. ఇటీవల చిత్తూరు అడవుల నుంచి 34 ఏనుగులు (రెండు మందలు) వచ్చాయని, వీటిలో 8 గున్న ఏనుగులు ఉన్నాయని అటవీ అధికారులు తెలిపారు. మండలంలోని కుక్కలదొడ్డి అన్నమయ్య కాలిబాట నుంచి అడవి మార్గంలో తిరుమల, తుంబురతీర్థం వంటి ప్రాంతాలకు భక్తులు వెళుతుంటారు. అయితే ఏనుగుల మంద ఉండటం వల్ల అడవిలోకి వెళ్లేందుకు అటవీశాఖాధికారులు ఎవరికీ అనుమతి ఇవ్వడం లేదు. గున్న ఏనుగులు ఉన్నాయి కాబట్టి వాటిని కాపాడుకునేందుకు మనుషులు కనిపిస్తే పెద్ద ఏనుగులు దాడి చేసే ప్రమాదం ఉందని అటవీ శాధికారులు అంటున్నారు. చిత్తూరు, పలమనేరు, కుప్పం, తిరుపతి అడవుల నుంచి అన్నమయ్య అడవుల్లోకి తరచూ ఏనుగులు వస్తుంటాయని అటవీ శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. అటవీ శాఖాధికారులు, సిబ్బంది వాటి కంట పడకుండా అడవుల్లో ఎర్రచందనం స్మగ్లర్ల కోసం కూంబింగ్ చేస్తుంటారని అధికారులు చెబుతున్నారు.



ఏనుగుల లద్దె

అడవిలోకి అనుమతి లేదు..



అడవిలోకి అటవీ అధికారుల అనుమతి లేకుండా వెళితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖాధికారి జగన్నాథ్‌సింగ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిలో ఎక్కడ ఎక్కువ ఆహారం ఉంటుందో అక్కడికి ఏనుగులు రావడం సహజంగా ఉంటుందన్నారు. అన్నమయ్య జిల్లా అటవీ పరిధి ఎక్కువ గా ఉండడంతో అడవిలోకి అనుమతి లేదన్నారు. అనుమతి లేకుండా వెళితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- జగన్నాథ్‌సింగ్, జిల్లా అటవీ శాఖాధికారి, రాజంపేట

ఆసుపత్రి ప్రాంగణంలో డంపింగ్ యార్డును తలపిస్తున్న చెత్త



అధ్వాన్నం

- డంపింగ్ యార్డును తలపిస్తున్న ఆసుపత్రి ప్రాంగణం
- పట్టించుకోని పారిశుధ్య నిర్వాహకులు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న రిమ్స్ అధికారులు

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది. జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి సైతం రోగులు వేలాది మంది వైద్యం కోసం నిత్యం కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వస్తుంటారు. రిమ్స్ ప్రాంగణంలో వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ కేర్, మానసిక ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల, వన్‌స్టాప్ సెంటర్ కూడా ఉన్నాయి. ఇంతటి ప్రాముఖ్యత గల రిమ్స్ ప్రాంగణం చెత్తకుప్పలతో నిండిపోయింది. చెత్తను డంపు చేయడానికి వైద్య కళాశాల, ఆసుపత్రి ప్రాంగణాన్ని శానిటేషన్ యాజమాన్యం వాడుతుండడంతో రోగులు ఆశ్చర్యపోతున్నారు. రోగాలను నయం చేసుకోవడానికి వస్తే.. కొత్త రోగాలు వస్తాయేమో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణలో.. నిర్లక్ష్యం

రిమ్స్‌లో శానిటేషన్ నిర్వహణ చేసేందుకు ఈ ఏడాది అక్టోబరు 1 నుంచి న్యూ సైంటిఫిక్ శానిటేషన్ పాలసీ టెండర్ల ద్వారా పద్మావతీ ఏజెన్సీ వారు టెండర్ పొందారు. నిబంధనలు ప్రకారం ఎంఓయూ అయిన రోజు నుంచి శానిటేషన్ నిర్వహణ జరగాలి. కానీ రెండు నెలలు పూర్తయినా శానిటేషన్ వ్యవస్థ మెరుగు పడలేదు. క్రిటికల్ కేర్, మురుగునీటి కాల్వలు, ఆసుపత్రి ఆవరణలో శుభ్రం చేసేటపుడు కార్మికులకు తలకు క్యాప్, చేతులకు గ్లౌజ్, బూట్లు కచ్చితంగా ఇవ్వాలి. అవి ఇంతవరకు ఏ కార్మికులకు ఇవి అందలేదు. తమకు జీతాలు కూడా ఇవ్వలేదని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు.

బయోవేస్ట్ సైతం..

గతంలో ప్రతిరోజు ఆసుపత్రిలో పోగైన బయో వేస్టును తీసుకెళ్లి బత్తలపల్లె వద్ద కాల్చేసేవారు. సాధారణంగా బయోవేస్ట్‌ను ప్రత్యేక పద్ధతిలో తరలించాల్సి ఉంటుంది. అలాగే ఐసీయూ వార్డులలో త్రీ బకెట్ సిస్టంతో రోజుకు ఆరుసార్లు క్లీనింగ్ నిర్వహించాలి. దీనికోసం మూడు రకాల కవర్లను ఉపయోగిస్తారు. కనీసం కవర్లను కూడా ఇవ్వకపోవడంతో సాధారణంగా ఉపయోగించే డస్ట్‌బిన్ కవర్లతోనే శుభ్రపరుస్తున్నారు. బయో చెత్తను ఎక్కడంటే అక్కడ డంప్ చేయడం వల్ల సరికొత్త రోగాలు విజృంభించడానికి ఆస్కారం ఉంది. ఆసుపత్రి ప్రాంగణం చెత్తతో నిండి రోగులు, వారివెంట వచ్చే బంధువులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పారిశుధ్యంపై ఆసుపత్రి అధికారులు దృష్టి సారించాలని రోగులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై సర్వజన ఆసుపత్రి సూపరింటెండెట్ డాక్టర్ వెంకటేశ్వర్లును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. పారిశుధ్య లోపం తన దృష్టికి పలుమార్లు వచ్చిందని, శుభ్రత విషయంలో మెరుగుపడాలని యాజమాన్యానికి తెలియజేశానన్నారు.



రిమ్స్ వైద్య కళాశాల లోపల సెమినార్ హాల్ వద్ద చెత్త

కూటమి పాలనలో సీమకు మహర్దశ

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



కడప మారుతీనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రాయలసీమకు మహర్దశ పట్టుకుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ద్వారకానగర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ చూపి పూర్వోదయ స్కీం ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి వీలుగా సుమారు రూ.40 వేల కోట్ల నిధులను రప్పించారన్నారు. అందులో 20వేల కోట్ల రూపాయలను రాయలసీమకోసం ఖర్చు చేస్తారన్నారు. ప్రధానంగా సీమలోని పెండింగ్ ప్రాజెక్టులతో పాటుగా అన్ని నేషనల్ హైవే రోడ్లను కలిపే గ్రామీణ ప్రాంత రోడ్లు సైతం బాగుపడతాయన్నారు. కూటమి ప్రభుత్వం పాలన చేపట్టిన 18 నెలలల్లోనే ఓ వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి పరుగులు పెట్టించేలా చంద్రబాబు పాలన సాగుతోందన్నారు.

నకిలీ మద్యం కేసులో అన్బురాసు అరెస్టు

- తంబళ్లపల్లె కోర్టులో హాజరు.. 14 రోజుల రిమాండ్

ములకలచెరువు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం కేసులో మరో కీలక అరెస్టు జరిగింది. టీడీపీ నుంచి సస్పెండైన దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఇంట్లో పనిచేస్తూ లావాదేవీలు చూసిన అన్బురాసు అలియాస్ బాబు (ఏ19)ను అరెస్టు చేశారు. బెంగళూరులో అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు మదనపల్లె ఎక్సైజ్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. అనంతరం బుధవారం రాత్రి తంబళ్లపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. దీంతో జడ్జి ఉమర్ ఫరూక్ 14 రోజులు రిమాండ్‌కు విధించడంతో మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. కాగా ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారానికి సంబంధించి ఎక్సైజ్ పోలీసులు మొత్తం 33 మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకు 31 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇంక మిగిలిన ఇద్దరు నిందితులు జయచంద్రారెడ్డి, అతడి బావమరిది గిరిధర్‌రెడ్డిలు అరెస్టు కావాల్సి ఉంది.

జోగి సోదరుల కస్టడీకి పిటీషన్

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో నిందితులైన మాజీ మంత్రి జోగి రమేశ్, జోగి రాములను కస్టడీకి కోరుతూ బుధవారం ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం కేసులో అరెస్టయి నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న జోగి సోదరులను ఈనెల 2వ తేదీ ములకలచెరువు కేసుకు సంబంధించి పీటీ వారెంట్‌పై తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచారు. ఈ క్రమంలో జోగి సోదరుల నుంచి నకిలీ మద్యం తయారీ వ్యవహారంపై కీలక విషయాలు రాబట్టాల్సి ఉందని, కస్టడీకి ఇవ్వాలని పిటీషన్ దాఖలు చేశారు.



తంబళ్లపల్లె కోర్టులో నిందితుడు అన్బురాసు

భవనాల గుర్తింపులో అధికారులు బిజీబిజీ

- *కలెక్టరేట్‌గా సబ్ కలెక్టర్ కార్యాలయం!*
- *జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎస్పీ కార్యాలయం...!*

మదనపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రకటన నేపథ్యంలో అధికార యంత్రాంగం అందుకు తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆధ్వర్యంలో మూడు రోజులుగా పట్టణంలోని ప్రధాన ప్రాంతాలు, భవనాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ నిశాంత్‌కుమార్ బీటీ కళాశాల, పక్కనే ఉన్న జీఆర్‌టీ స్కూల్‌తోపాటు వాటి మైదానాలను చూశారు. అలాగే ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రధాన భవనాలను పరిశీలించారు. ముఖ్యంగా బీటీ కళాశాలతో పాటు జీఆర్‌టీ స్కూల్, నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల, సీఎస్‌ఐ స్కూల్ కాంపౌండ్, రేస్ కళాశాల, హంద్రీ-నీవా కార్యాలయం కాంపౌండ్‌లను విడతల వారీగా చూశారు.

ఇదిలా ఉండగా అధికారులు మరో ప్రాతిపాదనను తెరపైకి తెచ్చారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం మధ్య భాగంగా తీసుకుంటే.. నాలుగు వైపులా నాలుగు రోడ్లు ఉన్నాయి. ఇందులో లోపలి భాగాన వివిధ శాఖలకు చెందిన కార్యాలయాలు, హాస్టళ్లు ఉన్నాయి. వీటన్నింటినీ ఖాళీ చేయించాలని నిర్ణయించారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్నే కలెక్టర్ కార్యాలయంగా పెట్టేస్తే అందులోని 23 విభాగాలకు కూడా ఇక్కడే భవనాలు, హాల్స్ కేటాయించవచ్చని చెబుతున్నారు. ఇందులో భాగంగా నాలుగు రోడ్ల లోపల ఉన్న అటవీ శాఖ కార్యాలయం, మున్సిపల్ టౌన్ హాలు, బేబీ వెల్‌కమ్ హోం, రెండు సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, వ్యవసాయ శాఖ కార్యాలయం ఉన్నాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ మినహా అన్నింటినీ ఇతర ప్రాంతాలకు తరలిస్తే 15 ఎకరాల విస్తీర్ణంలో సువిశాలమైన ప్రాంతం, అందులో పచ్చని చెట్లతో చల్లటి వాతావరణంలో కలెక్టరేట్ ఉంటుందని చెబుతున్నారు. ఎక్కువ భాగంలో ఉన్న అటవీ శాఖ కార్యాలయాన్ని బసినికొండ-పుంగనూరు రోడ్డులోని నగరవనానికి తరలించాలనే ప్రాతిపాదన వచ్చింది. ప్రభుత్వం కేటాయించే నిధులతో అక్కడే కార్యాలయాన్ని నిర్మించుకోవచ్చని సూచిస్తున్నారు. అక్కడ ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్, బాలసదన్‌లను కూడా మరో హాస్టల్‌లో విలీనం చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ మేరకు రెవెన్యూ, సర్వే శాఖాధికారులు సంయుక్తంగా శాఖల వారీగా ఉన్న భవనాలు, హాల్స్, ఖాళీ ప్రదేశం, విస్తీర్ణాలను లెక్కించారు. ఈ మేరకు మ్యాపులు సిద్ధం చేస్తున్నారు. అలాగే క్రిష్టియన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సీఎస్‌ఐ కాంపౌండ్‌ను కూడా పరిశీలించారు. ఇందులో ఎంఎల్‌ఎల్ హాస్పటల్ 11 ఎకరాలు, సీఎస్‌ఐ స్కూల్, నర్సింగ్ కాలేజీ, హాస్టల్స్ కలిపి 9.40 ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని కలెక్టర్ కార్యాలయంగా, బీటీ కళాశాలలో కొంత భాగాన్ని రెవెన్యూ విభాగానికి, నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎస్పీ కార్యాలయం, దాని అనుబంధ వింగ్‌లకు కేటాయించాలని దాదాపు ఓ నిర్ణయానికి వచ్చారు. సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఒక వైపున తీసుకోవాలని పోలీసు శాఖ నిర్ణయించినట్లు తెలిసింది.

అనువుగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలను పరిశీలించిన జిల్లాస్థాయి అధికారులు వాటి విస్తీర్ణం, మ్యాపులు రూపొందిస్తున్నారు. నాలుగైదు రోజుల్లో పూర్తి స్థాయిలో శాఖల వారీగా కేటాయింపులు పూర్తి చేయనున్నారు. ఇలా జిల్లాస్థాయిలో ఉండాల్సిన మొత్తం 63 విభాగాల కార్యాలయాలను ఈనెలాఖరులోగా గుర్తించే దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. మరోవైపు జనవరి మొదటికి జిల్లా అధికారికంగా ప్రకటించడం, వెంటనే కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం జనవరి 26వ తేదీ బెంగళూరు రోడ్డులోని బీటీ కళాశాల మైదానంలో గణతంత్ర వేడుకలు నిర్వహించేలా అధికారులు ముందుకెళ్తున్నారు.




సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న అటవీ శాఖ కార్యాలయం - సాంఘిక సంక్షేమ హాస్టల్

సిరికల్చర్ భవనాల పరిశీలన...

మదనపల్లె టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ఏర్పాటులో భాగంగా మదనపల్లె పట్టణంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన హెచ్‌వోడీ కార్యాలయాలు, మదనపల్లె ఆర్డీవో కార్యాలయం నిర్వహణ కోసం భవనాల ఎంపికకు సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి పలుచోట్ల పరిశీలించారు. బుధవారం స్థానిక బెంగళూరు రోడ్డులోని సిరికల్చర్ (పట్టుగూళ్ల ఉత్పత్తి కేంద్రం) భవనాల్లో ఉన్న 19 గదులను సబ్‌కలెక్టర్ పరిశీలించారు.

ఈ గదులు పొడవు, వెడల్పు, భవనం పైభాగాన మోల్డింగ్ స్థితిని సబ్ కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వీటితో పాటు మడికయ్యల శివాలయం వీధిలో ఉన్న బీటీ కళాశాల బాయ్స్ పీజీ హాస్టల్ భవనాలను పరిశీలించారు. అక్కడ ఆవరణలో ఉన్న కంపచెట్లను ఎక్స్‌కవేటర్‌తో క్లీన్ చేయించారు. అనంతరం ఆయా భవనాల స్కెచ్‌లను తయారు చేయాలని సచివాలయ సర్వేయర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ సుబ్రమణ్యం, వీఆర్‌వోలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి

క్రికెట్ జిల్లా జట్టుకు మదనపల్లె విద్యార్థి



మదనపల్లె టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు చిత్తూరు జిల్లా జట్టుకు మదనపల్లె విద్యార్థి ఎంపికయ్యాడు. బుధవారం పీలేరులో నిర్వహించిన అండర్-17 విభాగం డివిజన్ స్థాయి క్రికెట్ పోటీల్లో మదనపల్లెలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి తారీష్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరిచాడు. సెలెక్టర్లు అతడిని చిత్తూరు జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్లు అమృత, శ్రీదేవి మాట్లాడుతూ గురువారం చిత్తూరులో నిర్వహించే జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో తారీష్ పాల్గొంటాడని, అక్కడ ప్రతిభ చూపితే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు.

ప్రకృతి వ్యవసాయ సూత్రాలు అమలు చేయాలి



మాధవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎం

రాయచోటిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేస్తున్న పంటల విధానంలో గ్రామ స్థాయి నుంచి ప్రకృతి వ్యవసాయ సూత్రాలను అమలు చేయాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ తెలిపారు. రాయచోటి పట్టణంలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్ న్యాచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రారంభమైన ఐదు రోజుల శిక్షణలో భాగంగా బుధవారం రెండోరోజు డీపీఎం మాట్లాడుతూ ఐసీఆర్‌పీలు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల గురించి సమగ్రంగా వివరించారు. గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ సూత్రాలను రైతుల వద్దకు చేర్చడంలో ఐసీఆర్‌పీలు కీలకపాత్ర పోషించాలన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రయోజనాలు రసాయన రహిత పంటల ద్వారా భూమి సారాన్ని కాపాడడం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం వంటి అంశాలను వివరించారు. శిక్షణలో భాగంగా రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామం బలిజపల్లెలో ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి అనే రైతు పొలంలో ఏటీయం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ వేరుశనగ పంటలను పరిశీలించారు. అనంతరం ఇన్‌పుట్ ప్రిపరేషన్‌పై ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, సీడ్ ఫెర్టిలైజేషన్ తయారీ విధానం, వాటి ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎస్ఎఫ్ఏ చిరంజీవి, ఎఫ్ఎంటీలు, ఐసీఆర్‌పీలు మండల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్జీవో అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ సభ్యులు

రాయచోటిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవులు, రమేశ్, వైప్రసాద్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఒక్కొక్క పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి రాఘవులు ప్రకటించారు. ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు ఎన్నికలను పర్యవేక్షించారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సహాధ్యక్షుడిగా డీవీ శివారెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.మహదేవ, ఈ.నరసింహ, సిద్దయ్య, గణేశ్, ధీరజ్, స్వర్ణలత, కార్యదర్శిగా జె.శ్రీనివాసన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.హరిప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా రాజశేఖర్ రెడ్డి, వంశీప్రసాద్, సందీప్‌కుమార్‌రెడ్డి, విజయలక్ష్మి, జ్యోతి, సంయుక్త, కార్యదర్శిగా అంజనమ్మ, కోశాధికారిగా నాగేశ్వర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరు, రాజంపేట, పీలేరు, మదనపల్లె, వాల్మీకిపురం తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే పార్టీకి రాజీనామా చేయాలి

రాజంపేట జిల్లా సాధన జేఏసీ సమావేశంలో చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా జిల్లాల విభజన చేసి రాజంపేటకు అన్యాయం జరిగినప్పుడు స్థానిక వైసీపీ నాయకులు ఏమాత్రం నోరుమెదపకుండా ఈ ప్రాంతానికి అన్యాయం చేశారని, వారికి చిత్తశుద్ధి ఉంటే వైసీపీకి రాజీనామా చేసి రాజంపేట ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. బుధవారం రాజంపేట పాతబస్టాండులో జిల్లా సాధన సమితి జేఏసీ ఏర్పాటు చేసిన రిలే దీక్షల శిబిరానికి హాజరై తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జిల్లా విషయంపై తప్పు చేశారని బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం మరోసారి వైసీపీ దీక్షల నాటకం ఆడుతూ మరోమారు రాజంపేటకు అన్యాయం చేయడానికి పూనుకున్నారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాలే రాజంపేటకు శాపంగా మారాయన్నారు. వైసీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు భూకబ్జాలకు పాల్పడి కోట్లు సంపాదించి ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. రాజంపేట గొంతుకోసి తిరిగి కాపాడమని అరిస్తే ఎలా అని ప్రశ్నించారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి వైసీపీ హయాంలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేసినప్పుడు జడ్పీ చైర్మన్‌గా ఉండి రాజంపేట జిల్లా కేంద్రం కావాలని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. వైసీపీ నేతలు ఉమ్మడి కడప జిల్లాను విభజించినప్పుడే రాజంపేటను జిల్లా కేంద్రం చేసి ఉంటే ఇంత ఇబ్బంది ఉండేదా అన్నారు. రాజంపేట జిల్లా కోసం చిత్తశుద్ధితో చేసే పోరాటాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. అందరూ కలిసి వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ వద్దకు వెళ్లి తన జిల్లా వ్యవహారంపై అభ్యర్థిస్తామన్నారు. జనసేన పార్లమెంట్ నాయకుడు అతికారి కృష్ణ మాట్లాడుతూ రాజంపేట జిల్లా సాధనకు జనసేన పార్టీ అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. రాజీలేకుండా పోరాడుదామని పిలుపునిచ్చారు.



రిలే దీక్షలో సంఘీభావం తెలుపుతున్న జగన్‌మోహన్‌రాజు, అతికారి కృష్ణ తదితరులు

కూటమి నేతల ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభం

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ రాజంపేట పాతబస్టాండు ప్రాంతంలో కూటమి రిలే దీక్షలు ప్రారంభించారు. జేఏసీ నాయకులు, కూటమి నాయకులు ఈ రిలే దీక్షకు మద్దతు ప్రకటించారు. దీక్షా శిబిరంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూల విజయభాస్కర్, ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు అబ్బూరు ప్రభాకర్‌నాయుడు, సీపీఐ నాయకులు సికిందర్, సీపీఎం నాయకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని పోలీసుల సంక్షేమమే లక్ష్యం : ఎస్పీ

రాయచోటిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. బుధవారం ఎస్పీ పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధులతో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది, అధికారులతో, హోంగార్డ్స్ 24 గంటలు విధి నిర్వహణలో నిమగ్నమై ఉంటారన్నారు. ఈ ఒత్తిడిలో కూడిన వాతావరణంలో సిబ్బందికి ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వారికి మెరుగైన ఆరోగ్య భద్రత (హెల్త్ ఇన్సూరెన్స్) అందించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ నేపథ్యంలో ఆయా బ్యాంకులు తమ ఉద్యోగులకు అందిస్తున్న అత్యుత్తమ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీల వివరాలను త్వరితగతిన క్లెయిమ్ అయ్యే బీమా పథకాల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. పోలీసు సంక్షేమం కోసం బ్యాంకులు అందించే అన్ని రకాల సేవలు, రాయితీలపై కూడా ఈ సందర్భంగా ఎస్పీ చర్చించారు. అలాగే త్వరలోనే పోలీసు సిబ్బంది కోసం ఒక అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామని, ఆ సదస్సులో తమ ఆరోగ్య బీమా పథకాల పూర్తి వివరాలను, ప్రయోజనాలను సిబ్బందికి స్పష్టంగా తెలియజేయాలని బ్యాంక్ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో ఎస్బీఐ, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధులతో పాటు, ఏఏవో త్రినాథ సత్యం, ఆర్‌ఐ వెల్ఫేర్ ఎం.పెద్దయ్య, ఎస్పీ సీసీ ఉదయ్‌కుమార్, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాంకు ప్రతినిధుల సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

ఎప్పటికి పూర్తవుతుందో...?

- *నత్తనడకన అన్న క్యాంటీన్ భవన నిర్మాణం*
- *నిర్మాణానికి రూ.61 లక్షలు మంజూరు*
- *జూలై నుంచి ముందుకు సాగని పనులు*

పీలేరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు రూ.5కే కడుపునిండా రుచికరమైన భోజనం పెట్టాలన్న ఉన్నతమైన ఆశయంతో అన్న క్యాంటీన్ పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా పలు నియోజకవర్గాలలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. హోటళ్లకు వెళ్లి వందలాది రూపాయలు వెచ్చించి ఆకలి తీర్చుకోలేని పేదల పాలిట అన్న క్యాంటీన్ ఓ వరంగా మారింది. నిత్యం వేలాదిమంది పేదలు అన్న క్యాంటీన్లలో అతి తక్కువ ధరకే రుచికరమైన ఆహారంతో తమ ఆకలి తీర్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో రెండో విడతలో భాగంగా పీలేరు నియోజకవర్గానికి అన్న క్యాంటీన్ మంజూరు చేయించారు. ఇందులో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో క్యాంటీన్ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించారు. అనంతరం ప్రభుత్వం భవన నిర్మాణం కోసం రూ.61 లక్షలు నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరైనా భవన నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ఏడాది జూలై 10వ తేదీ భవన నిర్మాణానికి పీలేరులో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. దీంతో భవన నిర్మాణం మూడు నెలల్లో పూర్తి చేసి నవంబరు నుంచి అన్న క్యాంటీన్ పేదల ఆకలి తీర్చడం కోసం అందుబాటులోకి వస్తుందని అందరూ భావించారు. భవన నిర్మాణ ప్రారంభం నుంచి పనులు నత్తనడకన సాగుతుండడంతో ఎప్పటికి నిర్మాణం పూర్తి చేస్తారో అన్న అనుమానం స్థానిక టీడీపీ నేతల్లో నెలకొంది. ప్రారంభం నుంచి మూడు నెలల వ్యవధిలో అక్టోబరు 10 నాటికి క్యాంటీన్ నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తి కాకపోవడంతో సర్వత్రా నిరుత్సాహం నెలకొంది. ఐదు నెలలైనా సగం పనులు కాలేదు. నవంబరు నాటికీ అన్న క్యాంటీన్ అందుబాటులోకి వస్తుందని అందరూ భావించారు. అయితే ఆ దిశగా పనులు ముందుకు సాగకపోవడంతో అన్న క్యాంటీన్ ఎప్పటికో అన్న అనుమానం అందరూ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్, నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నత్తనడకన సాగుతున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు

మార్కెట్ కమిటీ షాపింగ్ కాంప్లెక్స్
అద్దె బకాయి రూ.10.8 లక్షలు

పీలేరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ షాపింగ్ కాంప్లెక్స్ అద్దె బకాయి రూ.10.8 లక్షలకు చేరుకుంది. మార్కెట్ కమిటీ అధికారుల ఉదాసీనత వల్లే నెలనెలా చెల్లించాల్సిన అద్దె చెల్లింపులో తీవ్ర జాప్యం నెలకొందని ఆరోపణలు ఉన్నాయి. పీలేరు మార్కెట్ కమిటీకి నెల నెలా షాపింగ్ కాంప్లెక్స్, గోడౌన్ల ద్వారా నెలకు సుమారు రూ.4,72,056 వస్తుంది. దీని ద్వారానే ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ఖర్చులకు వాడుతున్నారు. అయితే కాంప్లెక్స్‌లో షాపుల యజమానుల నుంచి కొన్ని షాపులలో నెలల తరబడి అద్దె బకాయిలు ఉండడం గమనార్హం. షాపుల యజమానుల నుంచి అద్దె వసూలు చేయడంలో మార్కెట్ కమిటీ అధికారుల విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

ఉత్పత్తిదారులకు వరం ఎంఎస్ఎంఈ

ఇండస్ట్రియల్ జిల్లా జనరల్ మేనేజరు కృష్ణకిశోర్



సమావేశంలో పాల్గొన్న ఇండస్ట్రియల్ జీఎం కృష్ణకిషోర్

మదనపల్లె అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ పరిశ్రమల ఉత్పత్తిదారులకు గొప్పవరమని ఇండస్ట్రియల్ జిల్లా జనరల్ మేనేజరు కృష్ణకిషోర్ అన్నారు. గొల్లపల్లె బైపాస్ రోడ్డులోని శ్రీరస్తు కల్యాణమండపంలో బుధవారం యువతకు అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న చిన్న, మధ్య తరహా పరిశ్రమల తయారీ కేంద్రాలను పెడుతున్న వారికి ఆర్థికంగా చేయూతనిస్తున్న ఎంఎస్ఎంఈ సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నామని, దీనివల్ల వారు ఏర్పాటు చేసుకున్న ప్రాజెక్టులను ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. ఏపీ ఎంఎస్ఎంఈ ద్వారా నిర్దేశించిన బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు మంజూరవుతాయని, కావున అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమం ద్వారా మదనపల్లెలో ఉచిత సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ సిబ్బంది, పరిశ్రమల లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు తంబళ్లపల్లె ఎంపీపీ ఉప ఎన్నిక

తంబళ్లపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ఎంపీపీ ఉప ఎన్నిక గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాపూజీ పట్నాయక్ తెలిపారు. తంబళ్లపల్లె ఎంపీపీ అనసూయమ్మ వ్యక్తిగత కారణాల వలన ఈ ఏడాది అక్టోబరు 13న తన ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. దీంతో మండలంలోని ఎంపీటీసీల ఆమోదంతో కోసువారిపల్లె ఎంపీటీసీ చిటికి శ్యామలమ్మను ఇన్‌చార్జ్ ఎంపీపీగా అక్టోబరు 27న ఎంపీడీవో ప్రమాణం చేయించారు. అవిశ్వాస తీర్మానం, రాజీనామా తదితర కారణాలతో రాష్ట్రంలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడానికి ఈనెల 11వ తేదీ ఎంపీపీ ఉప ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు తంబళ్లపల్లె మండలంలో ఉన్న 11 మంది ఎంపీటీసీల కోరంతో నియోజకవర్గ ప్రత్యేకాధికారి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కాగా తంబళ్లపల్లె మండలంలో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా అన్ని స్థానాల్లో వైసీపీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎస్‌ఐ ఉమామహేశ్వరరెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మదనపల్లెలో మిస్సింగ్..
శ్రీనివాసమంగాపురంలో హత్య

చంద్రగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మిస్సింగ్ అయిన వ్యక్తి.. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురంలో హత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె రూరల్‌కు చెందిన ఆవుల నరసింహులు, నాగరాజు, కత్తి నరసింహులు, నారాయణస్వామి.. చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన మునిరాజ స్నేహితులు. వీళ్లు తాంత్రిక వైద్యం, గుప్త నిధుల తవ్వకాలు చేస్తుంటారు. అయితే ఆవుల నరసింహులు.. తన భార్యతో సన్నిహితంగా ఉండటంపై నాగరాజు ఆగ్రహించాడు. ముందస్తు పథకం ప్రకారం అక్టోబరు 27వ తేదీ చంద్రగిరిలో తాంత్రిక వైద్యం చేయాలని ఆవుల నరసింహులు, నారాయణస్వామి, కత్తి నరసింహులను మదనపల్లెలో బస్సు ఎక్కించి పంపించాడు. వాళ్లకు తెలియకుండా వెనక మరో బస్సు ఎక్కి శ్రీనివాసమంగాపురంలో నాగరాజు దిగాడు. నరసింగాపురంలోని మునిరాజకు ఫోన్ చేసి ద్విచక్ర వాహనం తీసుకురమ్మని చెప్పాడు. అనంతరం ఆవుల నరసింహులు ఒక్కడినే శ్రీనివాసమంగాపురానికి పిలిపించారు. ద్విచక్ర వాహనంలో అతడిని ఎక్కించుకుని.. మామిడి తోపులోకి నాగరాజు, మునిరాజ తీసుకెళ్లారు. అక్కడ హత్య చేసి పూడ్చి వేశారు. ఆవుల నరసింహులు కనిపించడం లేదని మదనపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా స్నేహితులనూ విచారించగా.. నాగరాజ, మునిరాజు హత్య చేసినట్లు తెలిసింది. దీంతో మదనపల్లె పోలీసులు గురువారం నిందితులను తీసుకొచ్చి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఓబులవారిపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొర్లకుంట రైల్వే వంతెన సమీపంలో నిలిచి ఉన్న లారీని ఢీకొని ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నఓరంపాడు పంచాయతీ అయ్యలరాజుపల్లెకు చెందిన సి.శ్రీనివాసులరెడ్డి అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో రైల్వేకోడూరు వైపు నుంచి గ్రామానికి వస్తుండగా నిలిపి ఉన్న లారీని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు రైల్వేకోడూరు ఆస్పత్రికి తరలించారు.

అరటి ధరలు.. ఢమాల్

- ఆందోళనలో అన్నదాతలు
- సాగు పెట్టుబడి రాని వైనం
- ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూపులు



మిన్నయ్యగారిపల్లె వద్ద సాగు చేసిన అరటి

పెండ్లిమర్రి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన అరటి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. ఏ పంట సాగు చేసినా పంట చేతికి వచ్చే సమయానికి ధరలు పతనం అవుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం సాగు కోసం పెట్టిన పెట్టుబడి కూడా అందక అన్నదాతలు.. ఇక మాకు ఆత్మహత్యలే శరణ్యమంటూ గగ్గోలు పెడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

ఈ ఏడాది ఉల్లి, మిరప, టమోట, నిమ్మ ఇలా ఏ పంట సాగు చేసినా రైతులకు ఫలితం దక్కడం లేదు. ఇక అరటి ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. మూడు నెలల కిందట టన్ను రూ.20 వేలు పలికిన ధర నేడు టన్ను రూ.3 వేలకు పడిపోయింది. మన ప్రాంతంలో పండించే అరటికి ఇతర రాష్ట్రాలకు ఎక్స్‌పోర్టు లేకపోవడం, అక్కడ నుంచి అంతర్జాతీయ మార్కెట్‌లో విస్తారంగా అరటిపండ్లు లభిస్తుండటంతో మన పంటకు డిమాండ్ లేక పోవడం ప్రదాన కారణం.

మండలంలోని నాగాయపల్లె, చీమలపెంట, నందిమండలం, చెర్లోపల్లె తదితర గ్రామాల్లో ఎక్కువగా అరటి పంటను సాగు చేస్తారు. మొదటిసారి సాగు చేసిన పంట కోతకు వచ్చే సమయానికి 9 నెలల కాలం పడుతుంది. దుక్కిదున్నడంతో మొదలు ఎరువులు, పురుగుల మందులు, కలుపు, డ్రిప్ తదితర ఖర్చులతో ఎకరా అరటి సాగు చేసేందుకు లక్ష రూపాయలు ఖర్చు అవుతుంది. ఎకరాకు 1000 అరటి పిలకలు నాటాలి. మండలంలో భూసారాన్ని బట్టి ఒక్కో గెల 25 నుంచి 30 కేజీల వరకు ఉంటుంది. ఎకరాకు 30 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ధరలు బాగా ఉంటే ఖర్చులు పోను రైతులకు మంచి ఆదాయం వస్తుంది. అలా అదే భూమిలో తక్కువ సమయంలో రెండు మూడు కోలెలు సాగు చేసుకోవచ్చు. అయితే పండిన పంటను అడిగే దిక్కులేక ప్రభుత్వ సాయం కోసం రైతన్నలు ఎదురు చూపులు చూస్తున్నారు.



కోల్డ్‌స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలి

ధరలు లేనప్పుడు పండించిన పంటను నిలువ ఉంచుకునేందుకు ప్రభుత్వం కోల్డ్‌స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలి. ఉద్యాన రైతులను దృష్టిలో పెట్టుకుని కోల్డ్‌స్టోరేజ్‌లు ఏర్పాటు చేస్తే ధరలు వచ్చినపుడు అమ్ముకునే వెసలు బాటు ఉంటుంది.

-జి.గోపాల్‌రెడ్డి, రైతు, మిన్నయ్యగారిపల్లె.



గిట్టుబాటు ధర కల్పించాలి

మా ప్రాంతంలో రైతులు ఎక్కువగా ఉద్యాన పంటలను సాగు చేస్తారు. పంట చేతికి అంది వచ్చే సమయానికి ధరలు లేక సాగు పెట్టుబడులు కూడా రావడం లేదు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలి.

-రమణారెడ్డి, రైతు, నాగాయపల్లె

పునుగు పిల్లి ప్రత్యక్షం...

- పట్టుకునేందుకు చేసిన ప్రయత్నం విఫలం



సెప్టిక్ ట్యాంకులో పడిన పునుగు పిల్లి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి సమీపంలో అరుదైన పునుగు పిల్లి ప్రత్యక్షమైంది. అటవీశాఖ అధికారులు దాన్ని పట్టుకునేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. వివరాల్లోకి వెళితే.. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు కానీ బుధవారం కడప సెంట్రల్ జైలు సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో గల డి-బ్లాక్‌లోని ఓ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సెప్టిక్‌ట్యాంకులో పునుగు పిల్లి పడింది. లోతు ఎక్కువగా ఉండడంతో బయటికి రాలేక అక్కడే ఉండిపోయింది. స్థానికుల సమాచారంతో అటవీశాఖ అటవీశాఖ బీట్ ఆఫీసర్ పార్వతి మరికొంత మంది సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పునుగు పిల్లిని రక్షించి అడవిలో వదిలేందుకు ప్రయత్నించారు. మొదట ఒక బకెట్ కట్ చేసి.. సంచి తగిలించి దాన్ని బయటికి తీయాలని ప్రయత్నించగా వీలు కాలేదు. అనంతరం నిచ్చెనను గుంతలోకి దింపారు. దాని ద్వారా బయటికి పునుగు పిల్లి వచ్చినా... ఎవరికీ చిక్కకుండా పారిపోయింది. దీంతో పునుగు పిల్లిని స్వాధీనం చేసుకునేందుకు అటవీశాఖ అధికారులు చేసిన ప్రయత్నం విఫలమైంది.

అసలైన నిందితులెవరో నిగ్గుతేల్చాలి

- వైసీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి

కడప మారుతీనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లిని, చెల్లినీ తిట్టిన అసలైన నిందితులెవరో నిగ్గుతేల్చాలని వైసీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి ప్రభుత్వాన్ని, పోలీసులను కోరారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఆ ఇద్దరినీ తాను సోషల్‌మీడియాలో తిట్టానంటూ పోలీసులు అన్యాయంగా కేసులో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాను పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో 2024 ఫిబ్రవరిలో ఫిర్యాదు చేశానన్నారు. అప్పట్లో ఎస్పీగా ఉన్న సిద్ధార్థ కౌశల్, పులివెందుల సీఐ శంకర్‌రెడ్డి కేసు నమోదు చేసి నిందితులను పట్టుకున్నారన్నారు. ఆ రోజు అరెస్టయిన నిందతులపై క్రైం నెంబర్ 45/2024గా కేసు నమోదు చేశారన్నారు. అయితే దానిపై పోలీసులు ఇప్పటికీ చార్జిషీట్ వేయలేదని, నిందితులు ఎవరనే సంగతిని బయటకు చెప్పడం లేదన్నారు. అదే విషయంగా తెలంగాణలో కూడా తనపై కంప్లయింట్ ఉందన్నారు. ఇప్పటికైనా పోలీసులు, ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపించి తనకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న మోటార్ సైకిల్

- ఇద్దరు యువకుల మృతి
- మహారాష్ట్రకు చెందిన వారిగా గుర్తింపు



సంఘటనా స్థలంలో యువకుల మృతదేహాలు, పరిశీలిస్తున్న పోలీసులు, స్థానికులు

ఎర్రగుంట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం వచ్చిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. బుధవారం సాయంత్రం ఎర్రగుంట్ల పట్టణంలో ఆర్టీసీ బస్సును మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఈ సంఘటన జరిగింది. మృతులు మహరాష్ట రాష్ట్రానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వివరాల్లోకెళితే...

మహరాష్ట్ర రాష్ట్రం చంద్రాపూర్ జిల్లాకు చెందిన కరన్ విలాస్ తెలంగి(23), వినాయక్ శ్రవన్ చుదారి(34)లు పదిరోజుల క్రితం పనిచేసుకునేందుకు ఎర్రగుంట్లకు వచ్చారు. జువారీ కర్మాగారం లేబర్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఎర్రగుంట్ల-ముద్దనూరు రోడ్డులోని బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో మోటార్‌బైక్‌పై ఇద్దరు కలిసి వెళుతున్నారు. అదే సమయంలో సింహాద్రిపురం నుంచి ప్రొద్దుటూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సును ముందు భాగంలో ఢీకొన్నారు. దీంతో ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఒకరు వెంటనే చనిపోయాడు. మరొకరు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా 108 సిబ్బంది వచ్చి పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ నాగ మురళి సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ఏం జరిగిందో తెలియక జనం గుమికూడడం, పాఠశాలలు వదిలే సమయం కావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు క్లియర్ చేయించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ పరదేశిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుల కుటుంబాలకు సమాచారం ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

రీసర్వేలో అవకతవకలపై విచారణ



రైతులతో మాట్లాడుతున్న జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ

కొండాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకయ్యకాలువ గ్రామంలోని భూముల రీసర్వేలో గతంలో జరిగిన అవకతవకలపై జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ బుధవారం విచారణ చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వెంకయ్యకాలువ గ్రామానికి చెందిన రైతులతో సమావేశమయ్యారు. కాగా, రీ సర్వే అవకతవకలపై రైతులు ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె సర్వే అధికారులతో కలిసి రైతులతో మాట్లాడారు. గతంలో భూముల రీసర్వే చేసినప్పుడు తప్పులు జరిగాయని, తమకు న్యాయం చేయాలని రైతులు ఆర్డీవోను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప, సర్వే అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు (ఎస్సీ) నిరుద్యోగ యువతీ యువకులకు డిజిటల్ మార్కెటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రాకేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఆపై చదివిన షెడ్యూల్ కులాలకు చెందిన 18-40 ఏళ్లలోపు యువతీ యువకులు శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణకు అవసరమైన సామగ్రి, శిక్షణ అనంతరం ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఈనెల 13వ తేదీ లోపు మోడల్ కెరీర్ సెంటర్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు, కడపలో గల న్యాక్ శిక్షణా కేంద్రాలలో సమగ్ర సమాచారం పొందవచ్చన్నారు. వివరాలకు 9985142155, 9618177697 నెంబర్లను సంప్రదించాలన్నారు.

బుడ్డశనగకు తడివేరు తెగుళ్లు

- రైతులను అప్రమత్తం చేసిన అధికారులు



రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి అన్నదాతలకు సూచనలు, జాగ్రత్తలను అందించారు. ప్రొద్దుటూరు మండల పరిధిలో బుడ్డశనగ పంట ఇప్పటికే ఆరు వేల ఎకరాలకు పైగా రైతులు సాగు చేస్తున్నారు. వీటి విస్తీర్ణం మరో రెండు వేల వరకు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. మండల పరిధిలోని చౌడూరు, పెద్దశెట్టిపల్లె, బొల్లవరం, దొరసానిపల్లె, తదితర పంచాయతీల్లో అధికంగా రైతన్నలు పంట సాగు చేశారు. ప్రస్తుతం పైరు శాకోపదశలో ఉంది. ఈ దశలో పంటకు వ్యాపిస్తున్న తడివేరు తెగులును మండల వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ సాంబవర హరికుమార్ గుర్తించారు. దీనిని నివారించేందుకు లీటరు నీటికి వంద గ్రాముల టెక్సాకొనజోల్, రెండు మిల్లీలీటర్ల చొప్పున 19.19.19 ఎరువుతో కలిపి పిచికారి చేయాలన్నారు. ఇతర సందేహాలకు తమను సంప్రదించవచ్చన్నారు.

పుస్తక జ్ఞానంతో పాటు సామాజిక అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుస్తక జ్ఞానంతో పాటు సామాజిక అవగాహన కూడా అవసరమని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో 75 సంవత్సరాలలో మానవ హక్కులు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో వీసీ మాట్లాడుతూ హక్కులు బాధ్యతలను సమానంగా స్వీకరించాలన్నారు. కీలక ఉపన్యాసకురాలైన డాక్టర్ ఎ.సునీత మానవ హక్కుల ప్రకటన చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. దేశంలో పెరుగుతున్న జాతీయ వాదం, పౌరుల విభజన వంటి ధోరణులు ప్రమాదకరమని, అవి జాతి హననానికి దారితీసే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్, కాశ్మీర్ పరిణామాలను ఉదాహరణగా పేర్కొన్నారు. సర్ పేరుతో ఓటర్ నమోదు ప్రక్రియలో దళిత-ఆదివాసి వర్గాలకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ హక్కుల అమలుకు ప్రజల్లో అవగాహన ముఖ్యమని చెప్పారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్, కన్వీనర్ డాక్టర్ బీఆర్ సతీష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో డిజిటల్ హింస నిర్మూలనకు ఐక్యమవుదాం అనే అంశంపై 16 రోజుల క్రియాశీలతలో భాగంగా వెబినార్ నిర్వహించారు. లైంగిక వేధింపుల నిరోధక అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ మహిళా భద్రతా సెల్ సూపరింటెండెంట్ (సీఐడీ) ఐపీఎస్ రత్న వెలిసెల డిజిటల్ హింస, ఆన్‌లైన్ వేధింపుల రకాలు, ఐటియాక్ట్‌లోని శిక్షా నిబంధనలపై అవగాహన కల్పించారు. నేర తీవ్రతను బట్టి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రెండు లక్షల రూపాయల వరకు జరిమానా పడే అవకాశం ఉందన్నారు. సైబర్ క్రైమ్ పోర్టల్, శక్తివారియర్, ఈగిల్ వంటి వేదికలను బాధితులు ఉపయోగించుకోవాలన్నారు.

కలివికోడి పరిహారం పెండింగ్ భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

అట్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంబళ్లగొంది లో కలివికోడి పరిహారం అందని రైతుల భూములను బుధవారం అన్నమయ్య జిల్లా జేసీ, జీఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ కలెక్టరు ఆదర్శ రాజేంద్రన్ పరిశీలించారు. 2008లో కలివికోడి పరిహారం అందని కొంత మంది రైతులు కోర్టును ఆశ్రయించడంతో వారి భూములను పరిశీలించారు. కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, ఎస్‌డీసీ యూనిట్-2 నీలరా మయ్య, అట్లూరు డిప్యూటీ తహసీల్దారు శిరీషా, వీఆర్వో వెంకటసు బ్బమ్మ, వీఆర్‌ఏ రాము పాల్గొన్నారు.

మహిళా భద్రతపై అవగాహన

కడప క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళా భద్రతపై పాఠశాల, కళాశాలల్లో బుధవారం పోలీసు అధికారులు, సిబ్బంది విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సమాజంలో మహిళల భద్రత, పోక్సో ప్రాముఖ్యత గురించి వివరిస్తూ బాలికలు ఎదుర్కొనే మానసిక, శారీరక వేధింపుల పట్ల జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో వివరించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే మానసిక, శారీరక, సామాజిక నష్టాలపై ఉదాహరణలతో వివరించారు.

బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



ఖాజీపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని చెర్లోపల్లె రోడ్డు సమీపంలో ఆర్టీసీబస్సు ఢీకొన్న సంఘటనలో బింగిమల్ల శివ కుమార్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఖాజీపేటకు చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు శివకుమార్ పని నిమిత్తం చెర్లోపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా మైదుకూరు నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు స్కూటర్‌ను ఢీకొంది. దీంతో శివకుమార్ వెనుకటైరు కింద కాలు పడడంతో నుజ్జు నుజ్జు అయింది. చికిత్స నిమిత్తం 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు వారి బంధువులు తెలిపారు.

13న అంతర్ కళాశాలల పోటీలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల స్త్రీ, పురుషుల క్రీడా పోటీలు డిసెంబరు 13వ తేదీ ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ క్రీడ బోర్డు కార్యదర్శి డాక్టర్ కొవ్వూరు రామసుబ్బారెడ్డి తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ క్రీడాంశాలు, పురుషులు బెస్ట్ ఫిజిక్ పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. వ్యాయామ విద్య క్రీడ శాస్త్రాల విభాగంలో నిర్వహించే ఈపోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలన్నారు.


జాతీయస్థాయి పోటీలకు కోడూరు విద్యార్థి



విద్యార్థి యతిన్‌చందన్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

రైల్వేకోడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మోదుకూరులో ఈనెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించిన అండర్-19 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో కోడూరుకు చెందిన ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థి సి.యతిన్‌చందన్ ప్రతిభ ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జనవరి మూడో వారంలో మహారాష్ట్రలో నిర్వహించనున్న పోటీలో పాల్గొంటాడని బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు, డైరెక్టర్ వసుంధర తెలిపారు. అనంతరం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా హాకీ జట్టుకు ఎంపికైన జడ్పీ విద్యార్థినులు



ఎంపికైన షర్మిల, శృతిలతో ఎంఈఓ, హెచ్ఎం, పీడీలు

పులివెందుల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11, 12, 13 తేదీలలో అండర్-17 బాలికల హాకీ ఇంటర్ జిల్లాస్థాయి పోటీలలో కడప జిల్లా హాకీ జట్టుకు పులివెందుల జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారు. హెచ్ఎం గంగిరెడ్డి, పీడీలు ఫ్రాన్సిస్ తెలియజేస్తూ తమ పాఠశాలకు చెందిన షేక్ షర్మిల, స్టాండ్‌బైగా కె.శృతిలు జిల్లా హాకీ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 రామానాయుడు, హెచ్ఎం గంగిరెడ్డి, పీడీ రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. నెల్లూరులో జరిగే పోటీలలో ప్రతిభచూపి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఐ, రైతు సంఘం నేతలు

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కోరారు. రైతాంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా బుధవారం కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గాలి చంద్ర మాట్లాడుతూ తేమ శాతం, రంగు మారిందని కుంటి సాకులు చెబుతూ ధాన్యం కొనుగోలు చేయకుండా అనేక కొర్రీలు పెడుతున్నారన్నారు. కనీసం పంటను ఆరబెట్టుకోవడానికి, తడవకుండా కాపాడుకోవడానికి పట్టాలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రం, రైతు సేవ కేంద్రం, రవాణా ఇన్‌చార్జీలు, కస్టోడియన్ ఆఫీసర్లు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యం దళారులకు అమ్ముకునే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీంతో 75కేజీల బస్తాను రూ.1200 అమ్ముకొని బస్తాకు రూ.400 నుంచి రూ.500 వరకు నష్టపోతున్నారన్నారు. ధాన్యంతో పాటు పత్తి కొనుగోలు విషయంలో పీఎం యాప్, సీఎం యాప్‌ల పేరుతో అనేక ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలరాజు, కౌలు రైతు సంఘం నాయకులు సుదర్శన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కారం కావాలి

● ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే మాధవి


7వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

కడప మారుతీనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా పరిష్కారం కావాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆర్.మాధవి సూచించారు. బుధవారం స్థానిక ద్వారకానగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో వుంటూ సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు.

పరిశుభ్రతపై రాజీపడే ప్రసక్తే లేదు

కడప నగర పరిశుభ్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే ఆర్.మాధవి స్పష్టం చేశారు. మన కడప- స్వచ్ఛ కడప కార్యక్రమంలో భాగంగా బుధవారం నగర 7వ డివిజన్ కెనరాబ్యాంకు పరిధిలో ఆర్.మాధవి సంబంధిత శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత పరిశుభ్రత, డ్రైనేజీ, చెత్త నిర్వహణ, పౌర సౌకర్యాలపై ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్, కోశాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జ్ చిన్నబాబు, క్లస్టర్ ట్రాన్స్‌ఫార్మర్ శ్రీను, శ్రీకాళహస్తి బోర్డు సభ్యురాలు హైమావతి, జనసేన నాయకులు తుంగా రమణయ్య, జీ.వీ.రమణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు అంగన్వాడీల సమస్యలపై ఆందోళన

కడపసెవెన్‌రోడ్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు, గ్రాట్యుటీ అమలు చేయాలని డిసెంబరు 12న రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కడప కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసనను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్.నాగసుబ్బారెడ్డి, బి.మనోహర్‌లు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక హోచిమెన్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శులు మంజుల, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్ సందర్శన


జెయింట్ లిల్లీని పరిశీలిస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్కాయపల్లె సాయిబాబా హైస్కూల్ విద్యార్థులు బుధవారం ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా యోగివేమన యూనివర్సిటీ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. బాటనీ ప్రొఫెసర్ ఎ.మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటనలో పర్యావరణ సమతౌల్యంలో మొక్కల ప్రాధాన్యం, ఔషధ మొక్కల ప్రత్యేకతలను విద్యార్థులకు వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద వాటర్ లిల్లీ పాండ్ విద్యార్థులను ఆకట్టుకుంది. ప్లాంట్ ఆర్ట్ అడ్ క్రాఫ్ట్ విభాగాన్ని కూడా సందర్శించిన విద్యార్థులు సహజ వనరులతో కళాఖండాల తయారీపై అవగాహన పొందారు. హెడ్మాస్టర్ సుబ్బరాయుడు, రవితేజతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

కడప క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప నగర మేయరుగా నూతన ప్రమాణ స్వీకారం సందర్భంగా కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, ముద్దనూరు ఎంపీపీ ఎన్నికల సందర్భంగా జమ్మలమడుగు డీఎస్పీ ఆధ్వర్యంలో నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ నచికేత్ విశ్వనాధ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నేడు ఆయన స్వయంగా బందోబస్తు పర్యవేక్షించనున్నారు.

పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి

సీకేదిన్నె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ కూటమి ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇవ్వాలని ఆర్‌సీపీ మండల కార్యదర్శి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఇందిరానగర్‌లో బుధవారం అర్హులైన పేదలకు దరఖాస్తులు పంపిణీ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి స్థలాలకు ఈ నెల 16న కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రవి, బాలస్వామి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం


మార్కెట్‌యార్డు చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న షేక్ మహమ్మద్‌ఉస్మాన్, చిత్రంలో ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు

కడపరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కడప మార్కెట్‌యార్డు కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ యార్డు గౌరవ సభ్యురాలు, కడప ఎమ్మెల్యే ఆర్.మాదవిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డిలు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. వీరితో కలిసి మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ మహమ్మద్ ఉస్మాన్, వైస్ చైర్మన్ ఆర్.వెంకటసుబ్బారెడ్డిలు మాచుపల్లె బస్టాండ్ నుంచి మార్కెట్‌యార్డు వరకు పెద్దఎత్తున ర్యాలీగా తరలించారు. రాత్రి 7 గంటల సమయంలో మొదటగా మార్కెట్ యార్డు చైర్మన్‌గా షేక్ మహమ్మద్ ఉస్మాన్‌ను, తదుపరి వైస్ చైర్మన్‌గా ఆర్.వెంకటసుబ్బారెడ్డి, సభ్యుల చేత కడప మార్కెట్ యార్డు సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా ఆర్.వెంకటసుబ్బారెడ్డి ప్రమాణస్వీకారం చేస్తున్న సమయంలో రూ.10 నోట్లను వేదిక పైకి వెదజల్లారు. కుర్రకారు డబ్బులకోసం ఒకరినొకరు తోసుకుంటా ఎగబడ్డారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ పార్టీకి ద్రోహం చేసిన వారంతా వెళ్లిపోవడం వలనే తాను ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందానన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌లు మాట్లాడుతూ మార్కెట్‌యార్డు అభివృద్ధికి పాటుపడతామన్నారు. ఇదిలా వుండగా ప్రమాణస్వీకార సభకు జనాలను తీసుకొచ్చారే కానీ, వీరిలో రెండు వంతుల భాగం కూడా సభలో లేకపోవడంతో వెలవెలబోయింది. ఖాళీకుర్చీలు దర్శనమిచ్చాయి. సభ ప్రారంభం కాగానే జనం నాయకుల ప్రమాణ స్వీకారాన్ని, ప్రసంగాలను పట్టించుకోకుండా భోజనశాల వద్దకు బారులు తీరారు. సభా వేదిక వద్ద కూడా నాయకుల వ్యక్తిగత ఫొటోగ్రాఫర్లు, సోషల్ మీడియానే రద్దీగా కనిపించింది. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ సభ్యుడు ఫక్రుద్దీన్, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, పలువురు మార్కెట్ కమిటీ సభ్యులు, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు, డైరక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

హిందువులు జాగృతం కావాలి

● హిందూ సమ్మేళన నిర్వాహక సమితి ప్రతినిధులు

కడప కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణ కోసం సమాజంలోని హిందువులంతా జాగృతం కావాలని హిందూ సమ్మేళన సమితి కడప నగర అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వారణాసి శ్రీధర్‌శర్మ, కోశాధికారి మునగా సతీష్‌కుమార్, ప్రతినిధులు సింగారెడ్డి కీర్తి చంద్రారెడ్డి, కత్తి హేమంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మన దేశంలో హిందుత్వ ధర్మానికి కష్టాలొచ్చిన సమయంలో ఆయా సమస్యలను తీర్చిన వారిలో పలువురు కవులు, కళాకారులు, ధార్మిక సంస్థలున్నాయన్నారు. అందులో ప్రధానంగా ఆర్‌ఎస్‌ఎస్ ముందు వరుసలో ఉందన్నారు. గత 1925లో ఏర్పాటైన ఆర్‌ఎస్‌ఎస్ సరిగ్గా వంద సంవత్సరాల కాలంలో కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా హిందూ ధర్మకోసం, హిందువుల ఐక్యత కోసం శ్రమిస్తున్నదన్నారు. కాగా 100 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురష్కరించుకుని శతాబ్ది ఉత్సవాలలో భాగంగా హిందూ సమ్మేళన నిర్వాహక సమితి పేరుతో కడప నగర కమిటీ ఎన్నిక కాబడిందన్నారు. ముఖ్యంగా కడప నగరాన్ని 48 బస్తీలుగా ఎంపిక చేసుకుని ఈనెల 28వ తేదీ వరకూ ప్రతీ బస్తీలో హిందువులను జాగృతం చేసే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ బస్తీలో రెండు, లేక మూడు గంటల పాటు హిందువులను సనాతన ధర్మం వైపు నడిచేలా హితబోధ చేస్తారన్నారు. కావున ఆర్‌ఎస్‌ఎస్ కు కృతజ్ఞతాభావంగా ప్రతీ బస్తీ నుండి 100నుండి 200 మందికి తక్కువ కాకుండా హిందువులు సమ్మేళన కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

మానవ హక్కుల ఉల్లంఘనను ఎదుర్కోవాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి మధుసూదన్‌రావు

కమలాపురంరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవహక్కుల ఉల్లంఘన ఎక్కడ జరిగిన ధైర్యంగా ఎదుర్కొని నిలబడాలని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మానవహక్కులు ఎంతో విలువతో కూడుకున్నదన్నారు. ఈ నెల 13న జరిగే లోక్‌అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాది నాగభూషణంరెడ్డి, బార్ సహాయ కార్యదర్శి ఉదయ్‌కిరణ్, టి.వెంకటశివ, ఆర్.మహేశ్‌బాబు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ


మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, తదితరులు

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప నియోజకవర్గంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 70 వేల మంది సంతకాలు చేశారని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష, మాజీ మేయర్ సురేష్‌బాబు తెలిపారు. బుధవారం కడప నగరం మాజీ ఉప ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సేకరించిన 70వేల సతకాల పత్రాలను వైసీపీ జిల్లా కార్యాలయానికి పంపించారు. ఈ నేపథ్యంలో మాజీడిప్యూటీ సీఎం అంజాద్‌బాష, మాజీ మేయర్ కె.సురేష్‌బాబు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను కాపాడేందుకు ప్రజలు ముందుకువచ్చారని, ప్రతి సంతకాన్ని డిజిటలైజ్ చేశామని తెలిపారు. 17న మాజీ సీఎం వైఎస్ జగన్ గవర్నర్‌ను కలిసే సందర్భంలో ఈ కోటి సంతకాలు కూటమి ప్రభుత్వానికి బుద్ధి తెస్తాయన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, నగర నాయకులు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమలాపురం రూరల్: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వెంటనే విరమించుకోవాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామాంజులరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కోటి సంతకాల సేకరణ ప్రతులను కమలాపురం వైసీపీ కార్యాలయం నుంచి జిల్లా కేంద్రానికి తరలించారు. నియోజకవర్గ అబ్జర్వర్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక



వేముల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు వేముల కస్తూర్బా పాఠశాల విద్యార్థిని వి.ఉదయశ్రీ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శారదమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 9వ తేది వరకు నరసారావుపేటలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శారదమ్మ, ఉపాధ్యాయులు, పీఈటీ మనోహరి ఉదయశ్రీని అభినందించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

పులివెందుల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అర్బన్ సీఐ సీతారామిరెడ్డి సూచించారు. బుధవారం పులివెందులలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాలలో కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యఅధినియం (బీఎస్ఏ) చట్టాలను క్లుప్తంగా వివరించారు. అలాగే సైబర్ క్రైమ్ బారిన పడకుండా పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కమలాపురంరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం రైతు సమస్యలపై తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామ్మోహన్, గంగయ్య, రాయప్ప, శంకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సింహాద్రిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 33కేవీ జంగంరెడ్డిపల్లి ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంకాళమ్మగూడూరు, కోవరంగుట్టపల్లి, జంగంరెడ్డిపల్లి, రావులకొలను సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

రైతులకు మెరుగైన సేవలందించండి

● ఉద్యానశాఖ సహాయ సంచాలకుడు రవిచంద్రబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ సహాయ సంచాలకుడు రవిచంద్రబాబు

పులివెందులరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పంటలు తెగుళ్ల బారిన పడకుండా ఉన్నతాధికారుల సూచన మేరకు రైతులకు సూచనలు, సలహాలు అందించాలని ఉద్యాన శాఖ సహాయ సంచాలకుడు రవిచంద్రబాబు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో అరటి సిగటోక ఆకుమచ్చ తెగులు నివారణ, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, గెలల యాజమాన్యంపై గ్రామ ఉద్యాన సహాయకులకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటి గెలలకు మొగ్గ ఇంజక్షన్లు, గెలలకు తొడుగులు వేసుకున్నట్లయితే ఉద్యాన శాఖ వారు 50శాతం రాయితీ ఇస్తారన్నారు. అనంతరం కొవ్వూరు అరటి పరిశోధనా స్థానం సీనియర్ ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ సిగటోక ఆకుమచ్చ తెగులు వ్యాపించిన తోటల్లో ఆకులు తక్కువై కాయలు మాగే అవకాశం ఉందన్నారు. అనంతరం పలు మందులను సూచించి, వాడాల్సిన విధానాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవకు ఎన్ఎస్ఎస్ దోహదం

● ఘనంగా ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంప్


మొక్క నాటి నీరు పోస్తున్న జడ్పీటీసీ మారెడ్డి లత

పులివెందుల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ దోహదపడుతోందని పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్-2 ప్రత్యేక క్యాంప్ ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం,హెల్త్ క్యాంప్ నిర్వహణ, సహజ వనరులైన నీరు, విద్యుత్ వినియోగంలో పొదుపు పాటించాలని అవగాహన ర్యాలీలు చేయడం సంతోషకరమన్నారు. ముందుగా నల్లపురెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం విద్యార్థినిలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.బాలనారాయణ, ఎన్ఎస్ఎస్-2 పీఓ శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, సర్పంచు మౌనిక, ఏపీఎం ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓగా ఉమామహేశ్వరి


బాధ్యతలు చేపట్టిన ఉమామహేశ్వరి

పులివెందుల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఎంపీడీఓ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓ (గ్రామ సచివాయాలు, వార్డు సచివాలయాల అధికారి)గా జి.ఉమామహేశ్వరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. వేముల మండల ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆమెకు ఉన్నతాధికారులు పదోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సహకారంతో గ్రామాల్లో అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరువ చేసి మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు.

కట్టమంచికి ఘన నివాళులు

● ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

కడప కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సాహితీవేత్త కట్టమంచి రామలింగారెడ్డి 19 ఏళ్ల వయసులో కవిత్వీకరించిన ముసలమ్మ మరణం నాటి నవ్యతకు నిదర్శనమని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. కట్టమంచి రామలింగారెడ్డి 146వ జయంతిని పురష్కరించుకుని కడప రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రాజీవ్‌మార్గ్ రోడ్డులోని కడప రెడ్డిసేవా సమితి సమావేశ మందిరంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో లెక్కల కొండారెడ్డి, జి.ఆదినారాయణరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటేశ్వరాచారి, తదితరులతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి

● ట్రిపుల్‌ఐటీలో మానవ హక్కులపై సమావేశం

వేంపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నించే తత్వాన్ని చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ అధికారులు అరుణ్‌కుమార్‌రెడ్డి, కోనప్పలు తెలిపారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. మానవ హక్కులు, మన రోజూ వారి అవసరాలు అనే అంశంపై ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ అధికారులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి

● ఏఓకు బీజేపీ నేతల వినతి

పులివెందుల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రామాంజనేయరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ మండలంలోని నల్లపురెడ్డిపల్లె, యర్రబల్లె, ఇ.కొత్తపల్లె గ్రామాలలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ఆయా గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, సీనియర్ నాయకులు లక్షుమయ్య, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి వాజ్‌పేయి నాయుడు, నాయకులు తిరుపాల్‌రెడ్డి, శివనారాయణ, యుగంధర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప- తాడిపత్రి హైవే మండల పరిధిలోని ఓబాయపల్లె సమీపంలోని విజయదుర్గా గుడి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వివరాల మేరకు.. వల్లూరు గ్రామానికి చెందిన గంగన్న రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో గంగన్నకు కాలు విరిగిందని తెలిపారు. చికిత్స నిమిత్తం కడపకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉండాలి

కడప నాగరాజుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సమాన హక్కులు కలిగి ఉండాలని స్టెప్ సీఈవో ఐజె విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని శ్రీవేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, కళాశాల అధ్యాపకులు, స్టెప్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి ఉపయోగకరం


దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

వేంపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభ్యున్నతికి భవిత కేంద్రం ఎంతో ఉపయోగపడుతోందని ఎంఈఓ వెంకటరామిరెడ్డి, స్టాలిన్‌లు పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల వేడుకలను బుధవారం వేంపల్లె భవిత కేంద్రంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యతో పాటు శారీరకంగా, మానసికంగా వృద్ధి చెందేందుకు ఐఈఆర్టీలు యశోద, సుజాత, ఫిజియోథెరపీ డాక్టర్ ఆనంద్‌లు కృషి చేస్తున్నారని తెలిపారు. చైతన్య హైస్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి భవిత కేంద్రానికి రూ.10వేలు విరాళాన్ని ప్రకటించారు. కాగా భవిత కేంద్రంలోని దివ్యాంగులు ఆటల పోటీల్లో ప్రతిభ చూపారు. వారికి ఉషాకిరణ్ హైస్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డి ఒక్కొక్కరికి రూ.2వేల నగదు బహుమతి అందించారు. ఫిజియోథెరపీ యోగీశ్వర్‌బాబు భోజన ఏర్పాట్లు చేశారు.

కొనసాగుతున్న భూఆక్రమణలు

- కాశినాయనలో గందరగోళంగా మారిన మూలపల్లె సర్వే నెంబరు 1 భూములు
- భూ విస్తీర్ణం తక్కువ.. పట్టాలు ఎక్కువ
- సగానికిపైగా నకిలీ పట్టాలే..!
- ఆ భూముల కోసం తరచూ ఘర్షణలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు


ఆక్రమణదారులు చదునుచేసిన ప్రభుత్వ భూమి

కాశినాయన డిసెంబరు10(ఆంధ్రజ్యోతి) మండలంలో భూ ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంది. గత 10 రోజులుగా మూలపల్లె సర్వే నెంబరు 1లో గంగనపల్లె గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఎక్స్‌కవేటర్లతో చెట్లు తొలగించి భూములు చదునుచేసే పనిలో నిమగ్నమయ్యారు. చెట్లు పీకడం ,చదునుచేయడం, టిప్పర్లతో గంగనపల్లె చెరువులో నుంచి పెద్ద ఎత్తున మట్టితోలి చదును చేస్తున్నారు. అక్కడికి వెళ్లిన నర్సాపురం గ్రామస్థులు ఈభూములు తమవని 2000 సంవత్సరంలో పట్టాలు ఇచ్చారని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఘర్షణ చోటుచేసుకొంది.ఇప్పటికే ఈ సర్వే నెంబరులో చాలామంది అనధికారికంగా నకిలీ పత్రాలతో విస్తారంగా భూములు ఆక్రమించినట్లు ఆరోపణలున్నాయి. రెవెన్యూ అధికారులు సర్వే నెంబరు 1 పైకి అంటూ 10 మందికి పట్టాలు ఇస్తే అదేఅధికారి పేరున విచ్చల విడిగా నకిలీ పట్టాలు డీఫారాలు సృష్టించినట్లు సమాచారం. గతంలో ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన వారి పేరున ఈనకిలీ డీఫారాలు పట్టాదారు పాసుపుస్తకాలు బయటపడుతున్నాయి. వారు స్వహస్తాలతో ఇచ్చినవి పదైతే మరో పది నకిలీ సంతకాలతో బయటికి వస్తున్నాయంటున్నారు.. ఏది నకిలీనో ఏదిఅసలో తెలియక రైతులు ఆందోళనలో పడ్డారు. కాశినాయన మండలంలో ఇప్పటికే చాలాగ్రామాల్లో ఇలాంటి పరిస్థితి నడుస్తుంది. మూలపల్లె సర్వే నెంబరు 1లో దాదాపు 1000 ఎకరాలు ఉంది .ఇందులో సగానికిపైగా భూమి ఫారెస్ట్ వారు తీసుకున్నారు. ఇందులో మిద్దెలకు చెందిన 60 దళిత కుటుంబాలకు 4వ విడత భూపంపిణీలో పట్టాలు ఇచ్చారు. మిగిలింది కొందరు సాగుచేస్తుండగా మరికొంత ముళ్ళకంప పిచ్చిమొక్కలతో నిండిఉంది. ఈభూములోనే ప్రస్తుతం మావంటే మావంటూ ఘర్షణలు జరుగుతున్నాయి. మూలపల్లె సర్వే నెంబరు 1లో ఇప్పటికే చాలా మంది దొంగ పట్టాలు,డీఫారాలు బినామీల పేరున తయారుచేసి అనధికారికంగా పదుల ఎరాలు ఆక్రమించుకొన్నారని మండల వాసులు ఆరోపిస్తున్నారు. సర్వేనెంబర్ 1లో ఉన్న భూవిస్తీర్ణం కంటే మంజూరు చేసిన పట్టాలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈవిషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా తమకేమి తెలియనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మిద్దెల దళితులకు భూపంపిణీలో ఇచ్చిన భూమికూడా కొంతమంది బినామీ పేర్లపై నకిలీ పత్రాలతో ఆక్రమించుకొని పండ్లతోటలు పాగుచేసినట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మూలపల్లె సర్వే నెంబరు 1లో జరుగుతున్న భూ అవకతవకలపై సమగ్రంగా విచారించి అర్హులకు నిజమైన పట్టాదారులకు న్యాయం జరిగేలా చూడాలని పలువురు కోరుచున్నారు.

తహసీల్దార్ ఏమన్నారంటే: ఈ మూలపల్లె భూముల విషయంపై తహసీల్దారు వెంకటసుబ్బయ్యను 'ఆంధ్రజ్యోతి' వివరణకోరగా మూలపల్లె సర్వే నెంబరు 1పై ఏర్పడిన వివాదం తమదృష్టికి వచ్చిందన్నారు. దీనిపై సమగ్రంగా పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

మిద్దెల ఎస్సీల భూములు ఎక్కడున్నాయి

మూలపల్లె సర్వే నెంబరు 1లో 4వ విడత భూపంపిణీలో మిద్దెల ఎస్సీకాలనీకి చెందిన దాదాపు 60 మంది నిరుపేదలకు అప్పటి తహసీల్దారు ప్రభాకర్ రెడ్డి ఒక్కొక్కరికి ఎకరం చొప్పున పట్టాలు ఇచ్చారు. 5వ విడతలో మరో 60 మందికి భూమి ఇవ్వాలని సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఫైల్స్ తయారు చేశారు.కానీ అవిఏమయ్యాయే ఇప్పటికీ ఎవరికీ తెలియని పరిస్థితి. నెలల తరబడి కాళ్ళరిగేలా కార్యాలయం చుట్టూతిరిగినా నేటికీ ఒక్క దళితునికి కూడా ఎకరం భూమి ఇచ్చిన పాపాన పోలేదు

-ఎల్లయ్య, మిద్దెల దళిత కాలనీవాసి

ఎన్నికల హాలును పరిశీలించిన ఆర్డీవో


ఎన్నికల హాలును పరిశీలించి సూచనలిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

ముద్దనూరు డిసెంబర్10(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్న ఎంపీపీ ఎన్నిక హాలును బుధవారం ఆర్డీవో సాయిశ్రీ పరిశీలించారు.గురువారం ముద్దనూరు ఎంపీపీ ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల హాలును, వసతులను పరిశీలించారు. అలాగే ఎన్నికల నియమావళి పై ఎంపీడీవో రాధాకృష్ణవేణికి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ దస్తగిరి పాల్గొన్నారు.

రహదారి సమస్యను పరిశీలించిన ఆర్డీవో


సిద్దవరం గ్రామంలో రహదారి విషయమై స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

పోరుమామిళ్ల డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిద్దవరం గ్రామంలో రహదారి విషయమై రైతుల విన్నపం మేరకు స్థలాన్ని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. మండలంలోని సిద్దవరం గ్రామంలో రైతులు రహదారి విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లగా బుధవారం ఆయన 464 సర్వేనెంబరులో స్థలాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

అట్లూరు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ


పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

అట్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అట్లూరు పోలీసుస్టేషన్‌ను మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. పలు కేసుల రికార్డులను పరిశీలించి అనంతరం పోలీసు సిబ్బందికి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని గ్రామాల్లోని ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. అట్లూరు పోలీసుస్టేషన్ నుంచి బదిలీపై వెళుతున్న ఎస్ఐ రామక్రిష్ణను అభినందించారు. ఈసందర్భంగా పోలీసుల నుంచి ఆయన గౌరవవందని స్వీకరించారు. కార్యక్రమంలో బద్వేలు రూరల్ సీఐ క్రిష్ణయ్య, అట్లూరు ఎస్ఐ నాగకీర్తన, పోలీసు సిబ్బంది చంద్రభాస్కర్ నాగేశ్వర్‌రెడ్డి, శేఖర్ ఉన్నారు.

వైసీపీ నుంచి 30 కుటుంబాలు టీడీపీలో చేరిక


రితేష్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు

బద్వేలుటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వాసవీ అపార్ట్‌మెంట్‌లో ఆర్యవైశ్య వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు కేవీ సుబ్బారావు ఆధ్వర్యంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైసీపీకి చెందిన 30 కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరారు. వారందరికీ రితేష్‌కుమార్‌రెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరామన్నారు. మొదటి నుంచి ఆర్యవైశ్యులు టీడీపీకి అండగా నిలిచారని, టీడీపీ ప్రభుత్వంలోనే ఆర్యవైశ్యులకు పెద్దపీటవేశారని తెలిపారు. అనంతరం రితేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటుచేసి వారి అభివృద్ధికి పాటుపడటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కనుమర్లపూటి ప్రసాద్, సీనియర్ న్యాయవాది పీవీఎన్‌ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, శివయ్యస్వామి, రాధాక్రిష్ణ, నగలా సురేష్, కేవీ సుబ్బారావు, ఎల్ఎస్‌పీ డ్యాం చైర్మన్ ఈగ రమణారెడ్డి, సురేష్, సత్యం, సుధాకర్, నాగేంద్ర, గుబ్బా వెంకటసుబ్బయ్య, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ, హౌసింగ్ శాఖల మధ్య నలుగుతున్న జనం

- మండల సమావేశంలో సభ్యుడు వాసుదేవరెడ్డి ధ్వజం


మాట్లాడుతున్న ఎంపిడీవో

ఎర్రగుంట్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, హౌసింగ్ శాఖల మధ్య ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులు నలిగిపోతున్నారని వై.కోడూరు సర్పంచి వాసుదేవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎర్రగుంట్ల మండల సర్వసభ్య సమావేశం ఉప మండలాధ్యక్షులు మల్లుమోహన్‌రెడ్డి, పొన్న శ్రీను అధ్యక్షన ఎంపీడీవో వెంకటరమణయ్య నిర్వహించారు. సభలో సర్పంచు వాసుదేవరెడ్డి మాట్లాడుతూ వై.కోడూరు గ్రామానికి 21ఇళ్లు మంజూరు కాగా రెవెన్యూ, హౌసింగ్ రెండు శాఖల అధికారులు నిర్లక్ష్యం వల్ల 19మందికి ఇళ్లు రద్దయ్యాయని దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు సహాయం చేస్తుంటే స్థానిక అధికారులు మాత్రం తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈసారి కూడా 43మంది స్థలం కోసం, స్థలం ఉండి ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నారని వారిని అలాగే తిప్పుకుని అన్యాయం చేస్తారా అంటూ ప్రశ్నించారు. చిర్రాజుపల్లెలో పారిశుద్యం అధ్వానంగా ఉందని ఎంపీటీసీ మూలెరామలక్షుమ్మ ఆరోపించారు. కాగా ఎంపీడీవో వెంకటరమణయ్య మాట్లాడుతూ పారిశుద్య కార్మికులకు నెలకు రూ.6వేలు జీతాలు ఇస్తున్నామని, అయితే పనిచేసేందుకు ఎవరూ రావడంలేదని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యపరిష్కరించాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ ఒక బూటకం

- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి


మాట్లాడుతున్న మల్లెల లింగారెడ్డి


ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఒక బూటకమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోడ కింద కూర్చొని ఒక్కొక్కరు 20-30 వేల సంతకాలు చేశారని విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో వైద్య కళాశాలలను ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలలను పూర్తి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, దీని వలన ఎంబీబీఎస్ సీట్ల రేట్లు పెరగవన్నారు. ఇండిగో విమానాల రద్దును దృష్టిలో ఉంచుకుని విమానయాన శాఖ మంత్రి రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు డిమాండ్ చేయడం హాస్యాస్పదమన్నారు. జగన్‌పై 13 కేసులు ఉంటే కోర్టుల చుట్టూ తిరుగుతున్నా రాజీనామా చేయలేదెందుకని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకురాలు మల్లెల లక్ష్మీప్రసన్న, కామిశెట్టి బాబు, రామూనాయుడు, టప్పా మహబూబ్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ పత్రాల తరలింపు

జమ్మలమడుగు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాల కార్యక్రమంలో జమ్మలమడుగు నుంచి 50 వేలకుపైగా సంతకాలు సేకరించి పంపామని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జమ్మలమడుగు వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. అనంతరం సంతకాల సేకరణ చేసిన పుస్తకాలను జిల్లా కేంద్రానికి వాహనంలో పంపడానికి ఎమ్మెల్సీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, దన్నవాడ మహేశ్వరరెడ్డి, రుషికేశవరెడ్డి, గజ్జెల లక్షుమయ్య, మోహన్‌రెడ్డి, దేవగుడి చంద్రశేఖర్‌రెడ్డి, లొడిగి జయన్న, కొమెర్ల జగదీశ్వరరెడ్డి, గురివిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో: మైదుకూరు వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా నియోజకవర్గం నుంచి సేకరించిన డెబ్బైవేల సంతకాలను మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి నేతృత్వంలో జిల్లా అధ్యక్షులకు పంపించారు. ఆమేరకు బుధవారం ర్యాలీగా వెళ్లి వాటని జిల్లా కేంద్రాలకు పంపించినట్లు వైసీపీ నేతలు తెలిపారు.

వాటర్‌షెడ్ కమిటీ సభ్యుల ఎంపిక


గ్రామ సభలో మాట్లాడుతున్న అధికారులు

ముద్దనూరు డిసెంబర్10(ఆంధ్రజ్యోతి):మండల పరిధి బొందలకుంట సచివాలయం వద్ద బుధవారం వాటర్‌షెడ్ కమిటీని ఎన్నుకున్నారు. ఇందు కోసం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ పంచాయతీ వాటర్ షెడ్ కమిటీకి సంబంధించి 20 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు వాటర్‌షెడ్ ప్రాజెక్టు అధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. 2022 సంవత్సరంలో బొందలకుంట గ్రామ పంచాయతీని వాటర్‌షెడ్‌కు ఎంపిక చేశారు. అయితే అప్పట్లో గ్రామ సర్పంచు మునీశ్వరీ ప్రమేయం లేకుండా వాటర్‌షెడ్ కమిటీ ఏర్పాటు చేయడంతో సర్పంచు కోర్టును ఆశ్రయించడం కోర్టు స్టే ఇవ్వడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం వాటర్‌షెడ్ అధికారులు పాత కమిటీ సభ్యులతో 10 మందితో పాటు కొత్తగా మరో 20 మందిని సభ్యులను ఎన్నుకున్నారు. వచ్చే ఏడాది మార్చికి వాటర్‌షెడ్ పనులు ముగుస్తాయి. దాదాపు కోటి రూపాయల మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ దస్తగిరి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, వాటర్‌షెడ్ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టెలిఫోన్ స్తంభాల కోసం రోడ్లు ధ్వంసం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ స్తంభాల కోసం రోడ్లను తవ్వడంతో రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం వెదుర్ల బజార్‌లో టెలిఫోన్ స్తంబాన్ని తొలగించడానికి రోడ్డును తవ్వుతుండడంతో జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెలిఫోన్ స్తంభంలో ఉన్న కాపర్ కోసం రోడ్లను ధ్వంసం చేసి స్తంభాలను తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. దాదాపు రూ.6-7 వేలు విలువచేసే కాపర్ కోసం రోడ్లను ధ్వంసం చేసి టెలిఫోన్ స్తంభాలను తొలగించడం తగదన్నారు. రోడ్లు దెబ్బతినడం వలన ప్రజలు ఇబ్బంది పడుతారని, రోడ్లు ధ్వంసం చేయకుండా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు వితరణ


వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శివపురం వెంకటేశ్వర్ల కుమారుడు తరుణ్‌కుమార్ సౌజన్యంతో ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ కశెట్టి హైస్కూలు ఉపాధ్యాయుడు, ఆర్యవైశ్య సభ ఉద్యోగుల సంఘం సభ్యుడు దొంతు మురళీకృష్ణ ఆధ్వర్యంలో దుప్పట్లను బుధవారం పంపిణీ చేశారు. వృద్ధాశ్రమంలో 43 మందికి, అమ్మానాన్న మదర్‌థెరిసా వృద్ధాశ్రమంలో 27 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జెల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ వ్యాపార రీత్యా సూరత్‌లో స్థిరపడిన శివపురం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు పుట్టిన ఊరు ప్రొద్దుటూరుపై మమకారంతో తమవంతుగా ఈ కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఉపాధ్యక్షుడు మహమ్మద్‌అయూబ్‌ఖాన్, జాయింట్ సెక్రటరి పాలగిరి ఖాదర్‌బాష, ట్రెజరర్ దొంతు బాలాజీ, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమం నిర్వాహకులు సుబ్బరాయుడు, మేనేజర్ రఘునాథ్, సీబీఐటీ కళాశాల నోవా రోటోరాక్ట్ క్లబ్ సభ్యులు యూటీఎఫ్ జిల్లా సహఅధ్యక్షుడు రవికుమార్, ఉన్నారు.

రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం, మండల పరిధిలో కొందరు రేషన్ డీలర్లు నిత్యావసరవస్తువులను సక్రమంగా పంపిణీ చేయలేదని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీజే నాయకులు బుధవారం డిప్యూటీ తహసీల్దారు అజయ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీజే నాయకులు మాట్లాడుతూ 1వ తేదీ నుండి 10వ తేదీ వరకు ఉదయం 8 నుండి 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్‌షాపులను తెరచి ఉంచాలన్న నియమాన్ని చాలా మంది డీలర్లు పాటించడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌బాష, జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, రఫిక్, ముక్తియార్, సాబీర్,పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు పెంచండి


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కీలక పాత్ర పోషించే ఫీల్డ్ అసిస్టెంట్లకు అందిస్తున్న నెలసరి వేతనం రూ.5,745లతో కుటుంబాల పోషణ భారంగా మారిందని వేతనాలు పెంచి కుటుంబాలను ఆదుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. తమ న్యాయపరమైన డిమాండ్లను తీర్చాలని బుధవారం స్థానిక ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో మరణం సంభవించినప్పుడు వారి కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియాను కల్పించాలని డిమాండ్ చేశారు.

గృహనిర్మాణ శాఖలో ఆరోపణలు ఇంటిదొంగల పనే..

మైదుకూరు డిసెంబరు10(ఆంధ్రజ్యోతి):పేదలకు పక్కా ఇళ్లను నిర్మించాలన్న ఆకాంక్షతో పారదర్శకంగా పనులు చేపడుతున్న మైదుకూరు గృహనిర్మాణ శాఖలో అవినీతి జరిగిందంటూ ఇటీవల పనికట్టుకుని పదేపదే అవాస్తవాలను ప్రచారం చేస్తున్నది ఇంటిదొంగల పనేనని గృహనిర్మాణ శాఖ పీడీ రాజారత్నం తెలిపారు. విజిలెన్స్ అధికారులు, ఎంక్వైరీ కమిటీ సోదాలు నిర్వహించి ఎలాంటి అవినీతి జరగలేదని, స్టాకు రిజిస్టర్ ప్రకారం ఉండవలసిన మోతాదులో ఇనుపకడ్డీలు ఉన్నాయని నివేదిక ఇచ్చారని తెలిపారు. ఇక్కడ పని చేసిన గృహనిర్మాణ శాఖలోని ఇంటిదొంగలే అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు. విజిలెన్స్ అధికారులు త్వరలో కలెక్టర్‌కు కూడా నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. తప్పు చేసిన వారిని శిక్షించడం న్యాయం కాని తప్పు చేయనివారిని శిక్షించడం తప్పు అవుతుందన్నారు. తప్పుడు సమాచారం ఇస్తున్న వారిపై విచారణ చేపట్టి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

తుఫాన్ బాధిత రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

బద్వేలు,డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దాటికి నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం ఇవ్వాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా పార్టీల నాయకులు వీరశేఖర్, పిడుగు మస్తాన్‌లు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వరి, అరటి, బొప్పాయి, రైతులను ఆదుకోవాలన్నారు. రాష్ట్రప్రభుత్వం పండించిన పంట కొనుగోలు చేయాలని, అదేవిధంగా ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో చంద్రమోహన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పట్టణ సీపీఐ కార్యదర్శి బాలు, ఏరియా సహాయ కార్యదర్శులు పివీరమణ, ఇమ్మానుయేల్, కార్యవర్గ సభ్యులు వెంకటరమణ, గూడూరు పెంచలయ్య, నాగరాజు, రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.


ఏవో ఇక్బాల్‌బాషాకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

జమ్మలమడుగులో: మొంథా తుపాను వలన నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఏవో ఇక్బాల్‌బాషకు రైతాంగ సమస్యలకు సంబందించిన వినతి పత్రాన్ని అందజేశారు. ముందుగా వారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పట్ల కూటమి ప్రభుత్వం వైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పవన్, నాగేంద్ర, నవీన్, శంకర్, సంతోష్, ధనుష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు వారి హక్కులను వినియోగించుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి పద్మశ్రీ

బద్వేలు/ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పౌరుడు వారి హక్కులను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో ముందుకు సాగాలని సీనియర్ సివిల్‌జడ్జి వైజే పద్మశ్రీ తెలిపారు. ప్రపంచమానహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైకోర్టు ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుభాష్‌గాయత్రీ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు మానవహక్కులపై అవగాహన కల్పించారు. ఏపీపీ డీవీఎస్ క్రిష్ణ, న్యాయవాదులు సూర్యనారాయణరెడ్డి, చక్రవర్తి, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో: పట్టణంలోని పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గురుమూర్తి సీనియర్ దళిత నాయకుడు పిచ్చయ్య మాట్లాడారు. దళిత నాయకులు ప్రసాద్, ఆవాజ్ , ఆవాజ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, అన్వర్‌బాష పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: స్థానిక ఆలిండియా హ్యూమన్‌రైట్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్‌కళాశాల ఆవరణలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని ఆ సంఘం చీఫ్ గంగన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఎస్ఐ కొండారెడ్డి ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ డేవిడ్‌రాజ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డిలు ప్రసంగించారు.

ఎస్టీయూ మహాసభలను జయప్రదం చేయాలి

మైదుకూరు డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పరిషత్ ఆవరణలో ఈనెల 13, 14 తేదీలలో నిర్వహించే రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ)79వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి గోశెట్టి రామమోహన్ పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉండే ఎస్టీయూ శ్రేణులు, విద్యావంతులు,ఉపాధ్యాయులు, మేధావులు పాల్గొనాలని కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు నాయకులు పాల్గొన్నారు.